
రైతు బజారు... సమస్యలతో బేజారు

- కనీస వసతులు కరువు
- టార్పాలిన్‌ల కింద కూరగాయలు విక్రయిస్తున్న రైతులు
- తాగునీరు కూడా అందుబాటులో లేని వైనం
- మంత్రి కొండపల్లి ఇలాకాలో రైతు బజారు దుస్థితి


టార్పాలిన్ కింద కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

గంట్యాడ: రైతు బజార్లను తామే కనిపెట్టాం, వాటిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం అంటూ టీడీపీ నేతలు గొప్పలు చెబుతుంటారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. అభివృద్ధి మాట దేవుడెరుగు కనీ స సౌకర్యాలు కరువయ్యాయి. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్ వద్ద ఉన్న రైతు బజార్ దుస్థితే ఇందు కు నిదర్శనం. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సొంత మండలంలో ఈరైతు బజార్ ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.


మూలకు చేరిన వాటర్ ప్లాంట్


కొఠారుబిల్లి రైతు బజారు

టార్పాలిన్లే దిక్కు

రైతుబజార్‌లో షెడ్లు లేక పోవడం వల్ల రైతులు టార్పాలిన్ల నీడన కూరగాయలు విక్రయించుకోవాల్సి వస్తోంది. ఎండవేడిమి తట్టుకోలేక అల్లాడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో ఇబ్బంది పడుతున్నా రు. రైతు బజార్‌లో 14 దుకాణాలు ఉంటే 10 దుకాణాలకే మాత్రమే షెడ్లు ఉన్నాయి. నాలుగు దుకాణాలకు షెడ్లు లేవు. రైతు బజారుకు వచ్చే వినియోగదారులకు కానీ , కూరగాయలు విక్రయించుకునే రైతులకు కానీ కనీసం తాగడానికి నీళ్లు కూడా అందుబాటులో ఉండడం లేదు. మూలకు చేరిన వాటర్‌ప్లాంట్‌ను బాగు చేయించే నాథుడే కనిపించడం లేదు. మరుగుదొడ్డి కూడా ఒకటే ఉంది. దాన్ని మహిళలు మాత్రమే వినియోగించు కుంటున్నారు. పురుషులు మల, మూత్ర విసర్జనకు బయటకు వెళ్లాల్సి వస్తోంది.

ప్రతిపాదనలు పంపించాం

రైతు బజారులో కొత్త షెడ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతి వచ్చిన వెంటనే షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ఆర్‌ఓ ప్లాంట్ కోసం కూడా ప్రతిపాదనలు పంపించాం.

– కునుకు సంతోష్, రైతు బజారు ఇంచార్జి ఎస్టేట్ అధికారి

రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం


సీఐ నారాయణమూర్తిని సన్మానిస్తున్న డిపో మేనేజర్,తదితరులు

శృంగవరపుకోట: రహదారి భద్రతా మాసోత్సవాలను స్థానిక ఆర్టీసీ డిపోలో సీఐ వి.నారాయణమూర్తి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా డిపోమేనేజర్ రమేష్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15 వరకు నిర్వహించనున్న మాసోత్సవాల్లో డ్రైవర్ల శిక్షణ, ప్రమాదరహిత డ్రైవర్లకు అలవెన్స్‌లు, డ్రైవర్ల దినోత్సవం, వైద్యపరీక్షలు, డ్రైవర్ల ఫ్యామిలీ కౌన్సిలింగ్, రహదారి భద్రతా అవగాహన, రక్తదాన శిబిరం, డ్రైవర్లకు అవార్డు ప్రధానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నెలరోజుల పాటు సిబ్బంది భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ వివరించారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మొదిలి కన్నుమూత


మొదిలి శ్రీనివాసరావు (ఫైల్)

విజయనగరం అర్బన్: ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, శ్రమ శక్తి రాష్ట్ర అవార్డు గ్రహీత మొదిలి శ్రీనివాసరావు (65) కన్ను మూశారు. విశాఖలోని ఆయన స్వగృహంలో నిద్రలోనే గురువారం ఉదయం మృతి చెందినట్లు కుమారుడు కౌశిక్ గుర్తించారు. వెంటనే శ్రీనివాసరావు భౌతికకాయాన్ని విజయనగరంలోని స్వగృహానికి తరలించారు. పెద్ద ఎత్తున కార్మికులు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు శ్రీనివాసరావు భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. భార్య కమలావతి, ఇద్దరు కుమార్తెలు ఇందిరసంయుక్త, నాగద్యు నివేదిక, కుమారుడు కౌశిక్‌లను కలిగిన శ్రీనివాసరావు దివంగత కార్మిక నాయకుడు మొదిలి సత్యం కుమారుడు. మొదిలి సూర్యారావు సోదరుడు. తండ్రి, అన్నయ్య అడుగుజాడల్లో నడిచి కార్మిక వర్గానికి శ్రీనివాసరావు అత్యంత ఆప్తుడయ్యారు. 1983 ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పూసపాటి అశోక్ గజపతిరాజుపై పోటీ చేసిన చరిత్ర మొదిలి శ్రీనివాసరావుది. పలుముఠా కార్మిక సంఘాలకు అధ్యక్షుడిగా, జిల్లా తెలగ సంక్షేమ సంఘం నిర్మాణంలోనూ విస్తృతంగా పాల్గొని తన సహాయ సహకారాలు అందించారు. గతంలో ఆంధ్రభూమి దినపత్రికలో పనిచేసిన ఆయన ఐఎన్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారు. కార్మికలోకం ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని పలువురు సంతాపం వెలిబుచ్చారు. ఆయన మృతికి కార్మిక నాయకులు, పత్రికాప్రతినిధులు పలువురు తీవ్ర సంతాపం తెలియజేశారు.

తిరుగు ప్రయాణం


గజపతినగరంలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

గజపతినగరం: ఇతరప్రాంతాలకు వలసపోయి సంక్రాంతి పండగకు గ్రామాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమవుతున్నారు. స్వగ్రామాల నుంచి తిరిగి వెళ్లేవారితో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు గురువారం కిటకిటలాడాయి. మరో పక్క స్వంత వాహనాలతో వెళ్లేవారితో రోడ్లు రద్దీగా మారాయి. గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వినాయక గుడి వద్ద ఉన్న బస్టాప్‌కు చేరుకున్న ప్రయాణికులు బస్సులు ఖాళీ లేక పోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలి

దత్తిరాజేరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు దృష్టిసారించాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో ఆదేశించారు. వీధి కాలువల్లో పూడిక, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించి, బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, బోరుబావులను క్లోరినేషన్ చేపట్టాలని, అలాగే ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

ఈనెల 20 నుంచి లెప్రసీ సర్వే

చీపురుపల్లి: లెప్రసీ వ్యాధి గుర్తింపుపై వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వ హించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపా రు.జిల్లా పరిషత్ సీఈఓ ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు 14 రోజుల పాటు ఈసర్వే జరుగుతుందని పేర్కొన్నారు. ఆశ వర్కర్లు, అంగన్ వాడీ వర్కర్లు సర్వే నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఆర్థిక సహాయం

శృంగవరపుకోట: మండలంలోని శివలింగపురం రైల్వే పాయింట్స్‌మెన్‌గా పనిచేస్తూ మృతి చెందిన సత్యరంజన్ మహంతి కుటుంబానికి రైల్వే ఉద్యోగులు గురువారం ఆర్థిక సహాయం చేశారు. మలేరియా బారిన పడిన సత్యరంజన్ ఈనెల 7వ తేదీన చనిపోవడంతో ఎటువంటి ఆధారం లేని ఆ ఉద్యోగి కుటుంబానికి పీఎంఏ నారాయణరావు తమ ఉద్యోగులను సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. స్పందించిన రైల్వే ఉద్యోగులు, ఏపీఎం, ఏఏఐఎస్‌ఎంఏతో పాటు పలువురు స్టేషన్ సూపరింటెండెంట్లు, స్టేషన్ మాస్టరు, పాయింట్‌మెన్స్ రూ.1.22 లక్షలు పంపించారు. ఈమొత్తాన్ని సత్యరంజన్ కుటుంబానికి గురువారం అందజేశారు. సహకరించిన ప్లానింగ్ డీఏ రామరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

సజావుగా కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ


అభ్యర్థులకు ఛాతీ విస్తీర్ణం పరీక్ష చేస్తున్న అధికారులు

విజయనగరం క్రైమ్: స్టైపెండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటి, పీఈటీ పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపారు. 11వ రోజు గురువారం నిర్వహించిన పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులకు గాను 415 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. వారిలో 314 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారని పేర్కొన్నారు. నియామక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు ఎం.వీరకుమార్, యానివర్స్, ఎస్.రాఘవులు, తదితరులు పర్యవేక్షించారు.


హైజంప్ చేస్తున్న అభ్యర్థి



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

వైభవంగా సీతారాముల తీర్థం


ముకుందపురంలో పూజలందుకుంటున్న జనార్థనస్వామి


వల్లంపూడిలో పౌరాణిక నాటిక ప్రదర్శిస్తున్న స్థానిక యువత


వల్లంపూడిలో కబడ్డీ పోటీలు

వేపాడ: మండలంలోని వల్లంపూడిలో సీతారాముల తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వాహకులు ఏర్పాటు చేసిన మహిళల కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముకుందపురంలో జనార్థన స్వామి తీర్థం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

హోరా హోరీగా కబడ్డీ పోటీలు

వల్లంపూడిలో సీతారాముల తీర్థం సందర్భంగా గురువారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించిన కబడ్డీ పోటీలు హోరా హోరీగా సాగాయి. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచు జట్లకు నగదు బహుమతులు అందజేయనున్నారు.


వల్లంపూడిలో మహిళల కోలాటం

ఆయన నేత్రాలు సజీవం


కార్నియా సేకరిస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లి: ఆ ఊరిలో సామాజిక స్ఫూర్తిని రగిలించిన వ్యక్తి ఆయన. ఉపాధ్యాయుడిగా సేవలందించి, ఉద్యోగ విరమణ తర్వాత సర్పంచ్‌గా ఊరికి సేవ చేసి, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ద్వారా ఆధ్యాత్మిక సేవలందించి, మరణించాక నేత్రదానం చేసి మరింత స్ఫూర్తిని రగిలించారు. ఆయనే మండలంలోని పెదనడిపల్లి మాజీ సర్పంచ్, విశ్రాంత ఉపాధ్యాయుడు మన్నె పెదసత్యనారాయణ. ఈయన బుధవారం మరణించారు. అయితే ఆయన ముందుగానే నేత్రదానానికి అంగీకార పత్రం అందజేయడంతో కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఈ విషయాన్ని పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సంస్థకు సమాచారం ఇవ్వడంతో ఆ సంస్థ చైర్మన్ జగన్‌మోహన్‌రావు సూచనల మేరకు మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం వైద్య సిబ్బంది పి.సుజాత, ఉమాశంకర్ తదితరులు మృతుడి నుంచి కార్నియా సేకరించారు. కార్నియాను విశాఖపట్టణంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలిస్తున్నట్లు గోవిందరాజులు తెలిపారు.

గోమాతా.. నమోస్తుతే


చీపురుపల్లి: గోమాతకు పూజలు చేస్తున్న దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు ప్రతినిధులు


బొండపల్లి: కొవ్వాడపేటలో గోవుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

చీపురుపల్లి: గోమాతలను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్లేనని, అంతా మంచి జరుగుతుందని పట్టణానికి చెందిన దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు ముల్లు రమణ చెప్పారు. ముక్కనమను పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం గురువారం ఆసంస్థ ఆధ్వర్యంలో గోమాతలకు లక్ష్మీ పూజ చేశారు. పిండి వంటలను గోమా తలకు నైవేద్యంగా పెట్టారు. కుమరాం సర్పంచ్ ముల్లు రమాదేవి, ముల్లు దుర్గాప్రసాద్, ముల్లు వెంకటలక్ష్మణనాయుడు,తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి మండలంలో..

బొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ముక్కనుమ పండగను రైతులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే పాడి పశువులకు ప్రత్యేక పూజలు చేసి, పిండి వంటలు నైవేద్యంగా పెట్టి హారతులు ఇచ్చారు. అలాగే సాయంత్రం గ్రామాల్లో ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

శ్యామలా దేవికి పూజలు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో శ్యామలాదేవి పేరంటాల గుడిలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని రాజేటి వంశస్థులతో పాటు గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నా రు.

క్లుప్తంగా

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలోని ఉపాల యంలో షిర్డీసాయిబాబాకు అర్చకులు దూసి శ్రీధర్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో బాబాకు చక్రస్నానం, పంచామృతాభిషే కాలు చేయించారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు


గజపతినగరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి

గజపతినగరం: మండల కేంద్రంలోని సచివాలయం–2, పురిటిపెంట గ్రామ సచివాలయం –2 పరిధిలో గురువారం 104 వైద్యశిబిరాలు నిర్వహించారు. గజపతినగరం శిబిరంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి 49 మందికి, పురిటిపెంట శిబిరంలో డాక్టర్ సుష్మ 54మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు ఆరోగ్యజాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: స్థానిక రూరల్ ఫీడర్ పరిధిలోని కెరటాం,బిల్లలవలస, తమటాడ, గొల్లలపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మామిడికి మంచు ఎఫెక్ట్


శ్రీరంగరాజపురంలో పూతరాలిపోయిన మామిడి చెట్లు

గజపతినగరం: మామిడి రైతుకు దిగుబడి దిగులు పట్టుకుంది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో మామిడి తోటలు పూతకు రాలేదు. అరకొరగా వచ్చిన పూత సైతం నిలవడం లేదు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న మంచు ప్రభావంతో పూత రాలిపోతుండడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని దత్తిరాజేరు, మెంటాడ, బొండపల్లి, గజపతినగరం మండలాల్లో 16వేల ఎకరాల్లో మామిడితోటలను సాగుచేస్తున్నారు. డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు తోడు కొద్దిరోజులుగా కురుస్తున్న పొగ మంచు వల్ల పూత నిలవకపోగా తెగుళ్లు సోకుతున్నాయి. గజపతినగరం మండలంలోని ఎం.వెంకటాపురం, శ్రీరంగరాజపురం, బంగారమ్మపేట, ముచ్చర్ల, జిన్నాం తదితర గ్రామాల్లోని మామిడి తోటలు అరకొర పూతతో దర్శనమిస్తున్నాయి.

భూగర్భజలాలు ఉప్పమయం..

- తాగునీటికి తప్పని ఇక్కట్లు


చంపావతి ఉప్పటేరులో చేరుతున్న సముద్రపునీరు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామ సమీపంలో ఉన్న చంపావతి నదీ పరివాహక ప్రాంతంలో గల ఉప్పటేరులోకి సముద్రం నీరు కలుస్తుండడంతో తాగునీటి బోర్లు, వ్యవసాయ బోర్ల నీరు ఉప్పుగా మారుతోంది. దీంతో మూడు గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని బొడ్డు గురయ్యపేట, బొడ్డు వెంకటేశుపేట, కోనాడ గ్రామాలలో భూగర్భ జలాలు ఉప్పుగా మారాయి. చంపావతి నది కలిసే చోట గ్రోయిన్ కట్టినట్లయితే సముద్రపు నీరు రాకుండా గెడ్డలో కలవకుండా ఉంటుందని.. దీంతో కొంతవరకు భూగర్భజలాలు బాగుంటాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కోనాడ పరిసర ప్రాంతాలలో ఉన్న సుమారు 100 వరకు బోర్ల నుంచి ఉప్పునీరు వస్తోందని ప్రజలు చెబుతున్నారు. వ్యవసాయబావులు ఉన్నా ఉప్పునీరు వస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వర్షాధారంపై ఆధారపడాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి చంపావతి నదిలో గ్రోయిన్ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ ఎం. రాధిక మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.